


నేడే లక్ష రుణమాఫీ

- లక్షలోపు రుణాలున్న రైతుల ఖాతాల్లో జమకానున్న నగదు
- జిల్లాలో 44వేల మంది రైతులకు తొలివిడతలో మాఫీ
- రైతువేదికల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారుల ఏర్పాట్లు
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో నేడు జిల్లా వ్యాప్తంగా సంబురాలు

నిజామాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులకు పంట రుణాలమాఫీ గురువారం నుంచి మొదలు కానుంది. లక్ష రూపాయలలోపు ఉన్న రైతుల ఖాతాలో ప్రభుత్వం నగదు జమచేయనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించనున్నారు. ప్రభుత్వం ఒకేసారి రూ.2లక్షల రూపాయల లోపు రుణాన్ని మాఫీ చేస్తుండటంతో జిల్లాలో పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని మండలాల్లో ఒక్కొక్క రైతువేదిక వద్ద పెద్దఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఎమ్మెల్యేలు, అధికారులతో పాటు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కూడా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండలాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు తీయడంతో పాటు కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

మూడు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ

రాష్ట్ర ప్రభుత్వం రెండులక్షల రూపాయలలోపు రుణమాఫీని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు మూడు రోజుల క్రితమే ఉత్తర్వులను జారీ చేసింది. ఆ ఉత్తర్వులకు అనుగుణంగా రుణమాఫీని చేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ రుణమాఫీని మూడు విడతల్లో చేపట్టి ఆగస్టు 15లోపు పూర్తిచేయనుంది. మొదటి విడతగా లక్షలోపు రుణాలున్న రైతులకు సంబంధించి మొదటి విడతగా వారి ఖాతాల్లో డబ్బులను జమ చేయనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేపట్టింది. రెండో విడత లక్షన్నరలోపు ఉన్న రైతులకు ఈ నెలాఖరులోపు జమ చేస్తుంది. మిగతా రైతులకు రెండులక్షలలోపు రుణం ఉన్న వారికి ఆగస్టు 15లోపు పూర్తి చేసే విధంగా ఈ ఏర్పాట్లు చేసింది.

జిల్లా వ్యాప్తంగా లక్షా 80వేల మందికిపైగా రుణాలు తీసుకున్న రైతులు

జిల్లాలో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న వారు లక్షా 80వేలకు పైగా రైతులు ఉన్నారు. ప్రతీసంవత్సరం వ్యవసాయ అవసరాలకు ఖరీఫ్, రబీలో రైతులు ఈ రుణాలను తీసుకుంటున్నారు. స్వల్పకాలిక రుణాలు తీసుకుంటున్న రైతులు సంవత్సరంలోపు చెల్లిస్తున్నారు. దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నవారు విడతల వారిగా చెల్లిస్తున్నారు. ప్రభుత్వం పంటల కోసం స్వల్పకాలిక రుణాలు తీసుకున్నవారికి ఈ మాఫీని చేస్తుంది. జిల్లాలో రెండులక్షల రూపాయల లోపు రుణాలు తీసుకున్న రైతులు లక్షా 50వేల మందికి పైగా ఉంటారని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. వీరిలో మొదటి విడత లక్షలోపు రుణం ఉన్న రైతులు 44వేలకు పైగా ఉన్నట్లు అంచనాకు వచ్చారు. వీరందరికి నేడు ప్రభుత్వం రుణమాఫీ కింద డబ్బులను జమ చేయనుంది. వారి ఖాతాల్లో ఈ డబ్బులను వేయనున్నారు. వీరిలో 20వేలలోపు నుంచి లక్షలోపు రుణం తీసుకున్న రైతులు ఉన్నారు. మొదటి విడతలో వీరందరి ఖాతాల్లో ఈ డబ్బులు జమ చేయనున్నారు. ఇప్పటికే బ్యాంకుల వారిగా వివరాలను తీసుకున్న ప్రభుత్వం నేరుగా ఈ డబ్బులను జమ చేయనుంది.

నేడు బ్యాంకు అధికారులతో కలెక్టర్ సమావేశం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని రుణమాఫీని చేపడుతుండటంతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆధ్వర్యంలో గురువారం ఉదయం బ్యాంకర్లతో సమావేశాన్ని నిర్వహించనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ రుణమాఫీకి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యాంకుల ఖాతాల్లో డబ్బులు జమ కాగానే వాటిని రుణమాఫీకి మళ్లించాలని కోరనున్నారు. కొంత మంది రైతులు ఇతర రుణాలు తీసుకున్న డబ్బులను మాత్రం రుణమాఫీకే జమ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు ఇవ్వడంతో అన్ని బ్యాంకులతో ఆయన సమీక్షించనున్నారు. సాయంత్రం బ్యాంకుల వారిగా వివరాలను తీసుకోవడంతో పాటు పూర్తిస్థాయిలో ఏర్పాట్లను చేస్తున్నారు. రుణమాఫీ కాగానే రైతులందరికి కొత్త రుణాలను ఇచ్చే విధంగా బ్యాంకు శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించనున్నారు. బ్యాంకర్ల కమిటీలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా వానాకాలం సాగు కోసం ఈ రుణాలను మంజూరు చేసే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు.

రైతు వేదికల్లో సంబరాల నిర్వహణ

జిల్లాలోని 33 మండలాలు ఉండగా (అర్బన్ రెండు మండలాలు మినహాయించి) 31 మండలాల్లో రుణమాఫీ సంబరాల కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి విడతగా ప్రభుత్వం లక్ష రూపాయలను రుణాన్ని మాఫీ చేయడంతో పాటు డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తుండటంతో మండలానికి ఒక రైతు వేదికలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని 31 మండలాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ సంబరాలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు హాజరయ్యే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రభుత్వం ఖాతాల్లోకి డబ్బులను జమ చేయడం మొదలుపెట్టగానే ఈ రైతువేదికల్లో కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఏఏ రైతులకు రుణమాఫీ అయ్యిందో ప్రకటిస్తారు. ప్రభుత్వం చేపట్టిన ఇతర కార్యక్రమాలను కూడా వారు వివరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు

రైతు రుణమాఫీ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే సంబరాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల పరిధిలో ర్యాలీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని మండలాల పరిధిలో బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీలలో పాల్గొంటూనే రైతువేదిక వరకు ఈ ర్యాలీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం ఒకేదఫా ఈ రుణమాఫీని చేస్తుండటంతో తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఎమ్మెల్యేలతో పాటు పార్టీ సీనియర్ నేతలు, మండల, గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు హాజరయ్యే విధంగా చర్యలు చేపడుతున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ

- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూలై 17: గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు రెండులక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీ మేరకు గురువారం నుంచి రుణమాఫీ విడతల వారిగా చేస్తున్నామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తెలిపారు. బుధవారం నినగరంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు సోనియాగాంధీ ఆదేశాల మేరకు రైతులకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని ఇచ్చిన మాట మేరకు రెండులక్షలలోపు రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేసే ప్రక్రియలో గురువారం లక్షలోపు రుణాలు మాఫీ కానున్నాయని అన్నారు. ఈనెల 30లోగా లక్షా 50వేల లోపు రుణాలన్నీ మాఫీ చేయడం జరుగుతుందని ఆగస్టు నెలలో 2లక్షలలోపు రుణాలన్నీ మాఫీ చేయడం జరుగుతుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. జిల్లాలో గురువారం సాయంత్రం 4గంటలలోపు లక్షలోపు 44వేల 469 రైతులకు రుణాలు మాఫీ కానున్నాయని, అత్యధికంగా బోధన్ నియోజకవర్గంలో 12వేల 26 మంది రైతులకు లక్షలోపు రుణమాఫీ జరుగనుందన్నారు. గురువారం బోధన్ నియోజకవర్గం నుంచి సీఎంతో రైతు రుణమాఫీపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడటం జరుగుతుందని ఆయన అన్నారు. బ్యాంకర్లు కూడా రైతులను ఇబ్బంది పెట్టకుండా రుణమాఫీ అయిన మొత్తాన్ని ఇతర అకౌంట్లలో జమ చేయకుండా రైతులకు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ నాయకులంతా మండలాల్లో సమావేశాలు నిర్వహించి రైతు రుణమాఫీపై రైతులకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. అలాగే షాదీముబారక్, కల్యాణలక్ష్మీ చెక్కులను కూడా నేడు లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు ఈ సమావేశంలో ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, సీనియర్ నాయకులు గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, అంతిరెడ్డి రాజారెడ్డి, రత్నాకర్, జావిద్ అక్రమ్‌లు ఉన్నారు.

నేడు రైతు వేదికల్లో సంబురాలు

డిచ్‌పల్లి, జూలై 17: మండలంలోని రైతు వేదికల్లో సంబరాలు నిర్వహించనున్నారు. గురువారం నుంచి రైతుల ఖాతాల్లో రుణమాఫీ నగదు జమచేయనున్న నేపథ్యంలో సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో జరిగే రైతు రుణమాఫీ సంబరాల్లో ఎమ్మెల్యే, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని వ్యవసాయ అధికారి రాంబాబు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

జక్రాన్‌పల్లి రైతు వేదికలో చోరీ

జక్రాన్‌పల్లి, జూలై 17: మండల కేంద్రంలోని జక్రానపల్లిలో రైతు వేదికలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కొందరు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారని ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. రైతు వేదిక కార్యాలయంలో తలుపుల తాళలు పగులగొట్టి అందులో ఉన్న కెమెరా, మైక్‌సెట్‌ను చోరీ చేసి పరారోయారని ఎస్సై తెలిపారు. ఏఈవో వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. ఘటనా స్థలానికి క్లూస్ టీం పరిశీలించి వేలిముద్రలు సేకరించిందని ఎస్సై తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

- ఉదయం నుంచే భక్తుల పూజలు
- జిల్లా వ్యాప్తంగా సందడిగా మారిన వైష్ణవ ఆలయాలు



జెండా బాలాజీ ఆలయంలో భక్తుల పూజలు



నల్లూర్ ఆలయంలో..



నగరంలోని విఠలేశ్వర ఆలయం ఎదుట భక్తుల క్యూ

నిజామాబాద్ అర్బన్, జూలై 17: జిల్లా వ్యాప్తంగా తొలి ఏకాదశి పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని వైష్ణవ దేవాలయాలు సందడిగా మారాయి. భక్తులు ఉదయం నుంచి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ ఏకాదశిని దేవశయని ఏకాదశిగా పిలుస్తారు. హిందువుల తొలి పండుగగా ఏకాదశిని జరుపుకుంటారు. ఈరోజు నుంచే హిందువుల పండుగలు మొదలవుతాయి. తొలి ఏకాదశికి హైందవ సంస్కృతిలో విశేషమైన స్థానం ఉంది. ఈ పండుగకు హరి వాసరం, పేలాల పండుగ అని పిలుస్తారు. తొలి ఏకాదశి రోజున భక్తులు ఎక్కువగా ఉపవాసం ఉంటారు. ఇండ్లలో పిండివంటలు చేసుకుంటారు. జిల్లా కేంద్రంలోని ప్రధానమైన ఆలయాలు నీలకంఠేశ్వర ఆలయం, బాలాజీ ఆలయం, విఠలేశ్వర మందిర్, తదితర ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.





• కొల్లూర్ వద్ద పొంగుతున్న వాగు

జిల్లాలో కురుస్తున్న వర్షాలు

- జిల్లాలో సరాసరి 36.0 మి.మీ వర్షం నమోదు
- నవీపేటలో అత్యధికంగా 154.2 మి.మీ.
- ఎస్సారెస్పీకి 4468 క్యూసెక్కుల వరద

నవీపేటలో 15 సెంటిమీటర్ల వర్షం

నిజామాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు 36.0 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా నవీపేట మండలంలో 154.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో అత్యల్పంగా వేల్పూర్ మండలంలో 3.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 289.7 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 268.5 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో మొత్తం 33 మండలాలు ఉండగా 9 మండలాల్లో ఇప్పటి వరకు సగటు వర్షపాతం కంటే ఎక్కువగా వర్షం పడింది. జిల్లాలోని 18 మండలాల్లో సగటు వర్షపాతం నమోదైంది. కేవలం 6 మండలాల్లో సగటు వర్షపాతం కంటే తక్కువగా వర్షం పడింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో మరో ఐదు రోజుల పాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. వర్షాలకు అనుగుణంగా పంటల పనులు చేపట్టాలని తెలిపారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ప్రస్తుతం 4468 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను 1063.20 అడుగులకు చేరింది. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను 13. 833 టీఎంసీల నీళ్లు చేరాయి. జిల్లాతో పాటు ఎగువ ప్రాంతాల్లో పడుతున్న వర్షాలతో వరద వస్తోంది. మరో ఐదు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో వరద మరింత పెరిగే అవకాశం ఉందని ఎస్సారెస్పీ అధికారులు అంచనా వేస్తున్నారు.



అలుగు పారుతున్న కమలాపూర్ కొచ్చెరువు

నవీపేట: మండలంలో బుధవారం 15 సెంటిమీటర్ల వర్షపాతం నమోదైంది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలలోని చెరువులు, కుంటలకు నీటి ప్రవాహం భారీగా పెరిగింది. కమలాపూర్ కొచ్చెరువు పూర్తిగా నిండి అలుగు పారుతుంది. జన్నేపల్లి, తడగామ చెరువులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. భారీ వర్షాలకు జన్నేపల్లి వాగులో నీటి ప్రవాహం పెరిగింది. మరో మూడు రోజులు వర్షాలు ఇలాగే కురిస్తే మండలంలోని సగానికి పైగా చెరువులు పూర్తిగా నిండే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.



• కొల్లూర్ శివారులో నీటమునిగిన వరిపంట

బోధన్‌రూరల్: మూడు రోజులుగా భారీ వర్షం కురియడంతో పంట పొలాల్లో నీరు, కాలువలు, చెరువుల్లో నీరు నిండడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని శ్రీనివాస్ టాకీస్ పక్క నుండి వెళ్లే దారితో శర్బత్ కెనాల్ పొంగిపొర్లడంతో వర్షం నీరు రోడ్లపై నుంచి ప్రవాహించింది. దీంతో ఉదయం పూట ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కాలువ వద్ద ప్రజలు చేపలు పడుతూ సంబరపడ్డారు.

కోటగిరి: మండలంలో మంగళవారం అర్ధరాత్రి ఓ మోస్తరు భారీ వర్షం కురిసింది. మండలంలో 45.4మిల్లి మీటర్ల వర్షపాతం నమోదు కాగా పొతంగల్ మండలంలో 38.3మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. పొతంగల్ మండలంలోని దోమలెడ్గి, కొల్లూర్ వాగు ఉప్పొంగి ప్రవహించింది. భారీ వరదతో రాకపోకలు నిలిచిపోయాయి. కొల్లూర్, సోంపూర్, టాక్లీ, హెగ్డోలి గ్రామాల్లో పొలాలు నీటమునిగాయి. కొల్లూర్ శివారులో వరిపంట పొలాల్లో మోకాలి లోతు వరద నీరు ప్రవహించింది.

ఘనంగా పీర్ల పండుగ

నిజామాబాద్ అర్బన్, జూలై 17: ముస్లింలు రంజాన్ తర్వాత జరుపుకునే ప్రధానమైన పండుగలో ఒకటైన మొహర్రం పండుగను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. హసన్, హుస్సేన్ అనే ముస్లిం వీరుల స్మారకార్థం జరుపుకునే ఈ పండుగను పీర్ల పండుగ అని కూడా అంటారు. పది రోజుల పాటు జరుపుకునే ఈ వేడుకల్లో మొదటి రోజు పీర్లను ప్రతిష్టించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ధర్మయుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వీరులకు ప్రతీకగా రూపాలను తయారు చేసి వాటిని అలంకరించి ఊరేగించి పూజిస్తారు. వాటినే పీర్లుగా పిలుస్తారు. బెల్లంతో తయారు చేసిన నైవేద్యాలను తయారు చేసి సమర్పిస్తారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొహర్రం నుంచి కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. పదవ రోజు అత్యంత పవిత్రమైనదిగా భావించి అషూర దినంగా పాటిస్తారు. ముందురోజంతా ఉపవాస దీక్షను ఆచరిస్తారు. చాలా ప్రాంతాల్లో హిందూవులు, ముస్లింలు కలిసి పీర్ల పండుగను జరుపుకుంటారు. నగరంలో పలు చోట్ల పీర్లను ప్రతిష్టించి ఊరేగింపు నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు.



నగరంలో పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న యువకులు



ముదక్‌పల్లిలో పీరీల ఊరేగింపు



ఆర్మూర్‌లో పీరీలకు పూజలు చేస్తున్న భక్తులు



బోధన్‌లో పీరీలను ఊరేగిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, జూలై17 : ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గురువారం బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి, రెంజల్, నవీపేట, సాలూర, బోధన్ మండలాల్లో పర్యటిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, మందర్నా రవి తెలిపారు. బోధన్ పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్‌లో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికుల ధర్నా



నందిపేటలో ధర్నా చేస్తున్న గుత్ప, అలీసాగర్ లిఫ్ట్ కార్మికులు

నందిపేట, జూలై17 : మండల కేంద్రంలోని ఐలమ్మ చౌరస్తా వద్ద అర్గుల్ రాజారాం గుత్పఎత్తిపోతల పథకం, అలీసాగర్ లిఫ్ట్ కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా చేశారు. ముందుగా సీఐటీయూ ఆధ్వర్యంలో నందిపేట కొత్త బస్టాండ్ నుంచి నంది విగ్రహం, అంబేద్కర్ చౌరస్తా మీదుగా ఐలమ్మ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కుటుంబసభ్యులకు దూరంగా ఉంటూ, ప్రాణాలకు తెగించి, రాత్రి, పగలు పనిచేస్తే సంబంధిత లిఫ్ట్ కాంట్రాక్టర్లు జీతాలు ఇవ్వడం లేదని వాపోయారు. ఐదునెలల నుంచి జీతాలు ఇవ్వక పోవడంతో కుటుంబపోషణ భారమైందని తెలిపారు. జీతాలు చెల్లించాలని అడిగితే సంబంధిత కాంట్రాక్టర్లు తమను బెదిరిస్తున్నారని కాంట్రాక్టు కార్మికులు చెప్పారు. జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని ఐదునెలల జీతాలు ఇవ్వాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని బాధితులు హెచ్చరించారు. అలాగే ప్రభుత్వం వెంటనే స్పందించి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథ కాల కాంట్రాక్టు కార్మికుల సంఘం ప్రతినిధులు మూడ్ సీతారాం, కార్తిక్, అజయ్, బుచ్చన్న, రవి, నరేష్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : ఎస్.ఐ

రుద్రూరు, జూలై 17 : పచ్చదనం పెంచేలా ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని రుద్రూరు ఎస్ఐ అప్పారావు పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎస్ఐ అప్పారావు రుద్రూరు మండలంలోని అక్బర్‌నగర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తులతో కలిసి మొక్కలను నాటారు.

బోధన్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఒక్కరిపై ఉందని బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. బుధవారం సాలూర మండలంలోని మందర్నా గ్రామంలో ప్రతి ఇంటికి చెట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మందర్నారవి, మాజీ సర్పంచ్ రావుబా గంగాధర్, పోలీసు సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు బెలూన్స్ ఏర్పాటు

డిచ్‌పల్లి, జూలై 17 : మండలంలోని నడిపల్లి పంచాయతీ ఈవో కిషన్ రావు, సిబ్బంది మూకుమ్మడిగా పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీ, నడిపల్లి, డిచ్‌పల్లి స్టేషన్ ప్రాంతాల్లో వర్షాల నేపథ్యంలో డెంగీ దోమల భారిన ప్రజలు గురి కాకుండా మురికి కాల్వల్లో క్రిమి సంహారక మందులతో తయారు చేసిన బెలూన్స్‌ను దోమల నివారణకు మురుగు కాల్వల్లో వేశారు. ప్రజలు కూడా ట్యాంకుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈవో కిషన్‌రావు పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్‌లో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు వినూత్న చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవీపేట్ర్యూజూలై17: మండలంలోని అబ్బాపూర్(ఎం) సమీపంలో ఈ నెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తమ్మిడి ప్రవీణ్ (31) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. తన మేనకోడలు హరిణిని బైక్‌పై నిజామాబాద్ తీసుకెళ్తుండగా ధర్మారం మూలమలుపు సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో ప్రవీణ్‌కు తీవ్రగాయాలు కాగా అతని మేడకోడలుకు స్వల్ప గాయాలు అయిన విషయం విదితమే. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ప్రవీణ్ మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడున్నారు. మృతుడు రెంజల్ మండలం వీరన్నగుట్టకు చెందిన వాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య

నవీపేట, జూలై 17 : మండలంలోని అబ్బాపూర్ (బీ) తండాకు చెందిన సేనావత్ వినోద్ (27) అనే ఆటోడ్రైవర్ ఆర్థిక ఇబ్బందులు తాళలేక మంగళవారం రాత్రి గుర్తుతెలియని మందును సేవించగా బుధవారం ఉదయం చికిత్సపొందుతూ మృతిచెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. వినోద్ గతంలో ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లగా రెండు సంవత్సరాల క్రితం స్వదేశానికి వచ్చి ఆటో నడుపుకుంటూ ఉపాధి పొందేవాడని అన్నారు. వినోద్ ఉపాధి నిమిత్తం ఫైనాన్స్ ద్వారా ఆటోను కొనుగోలు చేశాడు. ఫైనాన్స్ చెల్లించకపోవడంతో ఆరుమాసాల క్రితం అప్పు ఇచ్చిన ఫైనాన్స్ వారు ఆటోను తీసుకెళ్లారు. దీంతో ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడేవాడు. మంగళవారం రాత్రి వినోద్ తన ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందును సేవించగా బుధవారం ఉదయం చికిత్సపొందుతూ మృతిచెందాడని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య కవిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

మెండోర, జూలై 17 : మండల కేంద్రానికి చెందిన దమ్మడి పోసాని తన వ్యవసాయ పనులకు మధ్యాహ్నం వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్ళాడని బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. దమ్మడి పోసాని భర్త రాజన్నతో కలిసి మెండోర, సావెల్ గ్రామాల మధ్య ఉన్న తమ వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. రాజన్న ముందు నడుస్తున్నాడు. కొద్ది దూరం వెనుకలో పోసాని నడుచుకుంటూ వస్తుంది. బైక్‌పై వచ్చిన వ్యక్తి పోసాని వద్ద ఆగి పోచంపాడ్ ఎటువైపు వెళ్లాలి అని అడిగాడు, ఆమె దారి చెప్పేలోపు క్షణాల్లో మెడలోంచి తులంన్నర బంగారు గొలుసు లాక్కెళ్ళాడని బాధితురాలు కన్నీరుమున్నీరు అయింది. మెడలో బంగారు గొలుసు లాక్కెళ్ళిన సమయానికి నాలుగు నిమిషాల వ్యవధిలో సావెల్, దోబీఘాట్ వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో పల్సర్ బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కనిపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మాక్లూర్, జూలై17: మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గానగర్ కింది తండా బస్టాండ్ వద్ద గుర్తుతెలియని సుమారు 75ఏళ్ళ యాచకురాలు మృతదేహం లభ్యమైనట్టు ఏఎస్సై గంగారాం తెలిపారు. మృతురాలు ముఖం గుర్తుపట్టకుండా ఉందని బుధవారం కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఏఎస్సై తెలిపారు.

మాంసం వ్యాపారిపై దాడి

బోధన్‌రూరల్, జూలై 17 : బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో మటన్ వ్యాపారి రాజేశ్వర్‌పై కొంతమంది వ్యక్తులు దాడి చేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొనట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజ్‌ల ద్వారా అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని, దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

యువకుడి అదృశ్యం

ఎడపల్లి, జూలై17 : మండల కేంద్రానికి చెందిన మొగిలిచెర్ల చిన్న సాయిలు అదృశ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 11వ తేదీన కూలీ పనికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సాయిలు నేటి వరకు తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్ళలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని అన్న మొగిలిచెర్ల పెద్దసాయిలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో సత్తా చాటిన విద్యార్థి



విద్యార్థి రూపేష్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నిజామాబాద్ అర్బన్, జూలై 17 : ఇటీవల నిర్వహించిన ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2024 పోటీలలో నగరానికి చెందిన ది పాఠశాల స్కూల్ విద్యార్థి ఈగరూపేష్‌రెడ్డి సత్తా చాటాడు. పోటీలో గోల్డ్ మెడల్ సాధించి జిల్లా ఖ్యాతిని పెంచాడు. నగరంలోని వినాయక్‌నగర్ ది పాఠశాల స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రూపేష్ తైక్వాండోలో జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించడంపై పాఠశాల యాజమాన్యం విద్యార్థిని పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్కొండలో కాంగ్రెస్ నాయకుల సమావేశం

భీమ్‌గల్ రూరల్, జూలై 17 : బాల్కొండ నియోజక వర్గంలోని ఎనిమిది మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా మండల కార్యవర్గ సభ్యులు బుధవారం భీమ్‌గల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్‌గల్ మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరెస్వామి మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గంలోని ముగ్గురు సీనియర్ నాయకులైనటువంటి బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, మానాలమోహన్ రెడ్డి, అన్వేష్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి తాహెర్ బీన్ హుందాన్‌లకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు ఇవ్వడం చాలా సంతోషంగా వుందని అన్నారు. ఈనెల 19వ తేదీన సహస్ర ఫంక్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించబడుతుందని, కార్యక్రమానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమర్ గౌడ్, ముత్యాల సునీల్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఏకాదశి పూజలు



రుద్రూర్‌లో పాల్గొన్న భక్తులు



రుద్రూర్‌లో పూజలు..

పెర్కిట్, జూలై17: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో వెంకటేశ్వరకాలనీలో గల లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో తొలిఏకదశి సందర్భంగా పూజలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు ఆనంద చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కోటగిరి : మండలంలో బుధవారం తొలి ఏకాదశిని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఏకాదశి ఉపవాస దీక్షలు విరమించేందుకు బుధవారం ఆయా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రుద్రూరు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం రుద్రూరు మండల కేంద్రంలోని శ్రీ పాండురంగ విఠలేశ్వర ఆలయంలో తొలి ఏకాదశి పురస్కరించుకుని బుధవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ అర్చకులు రామశర్మ, నారాయణరావుల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు.

ముప్కాల్ : అషాడమాసంలో వచ్చే తొలి ఏకాదశి ముప్కాల్, బాల్కొండ మండలాల్లో భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిట కిటలాడాయి. భక్తులు ఉపవాస దీక్షలు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

బోధన్‌రూరల్ : బోధన్ పట్టణం, సాలూర, బోధన్ మండలాల్లోని విఠలేశ్వరాలయాల్లో, పలు దేవాలయాల్లో వైకుంఠ తొలి ఏకాదశి పండుగను బుధవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

డిచ్‌పల్లి : మండలంలోని ధర్మారం (బీ) , డిచ్‌పల్లి, ఘన్‌పూర్, గ్రామాల్లో గల వేం కటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, నిర్వ హించారు. మండల కేంద్రంలోని కాశీవిశ్వనాథ ఆలయంలో తొలి ఏకాదశి పురష్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలునిర్వహించారు.

నవీపేట: యంచలోని చారిత్రక విఠలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు జిల్లాలోని పలుప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. బుధవారం రాత్రి ఆలయంలో భజనలు, కీర్తనలు నిర్వహించారు. గురువారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే మండల కేంద్రంలోని దర్యాపూర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల కేంద్రంలోని రామాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు మొదలుపెట్టారు. వేదపండితుల మంత్రోచ్చరణాల మధ్య అభిషేకం, యజ్ఞం, హోమాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు రామా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో తొలి ఏకాదశి సందర్భంగా శివాలయం, సాయిబాబా ఆలయం, రామాలయం, వెంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు హిందు తొలి ఏకాదశి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంతో పాటు మండలంలోని చింతకుంట, గోవూర్, తిమ్మాపూర్, చేనెంబర్ దుబ్బ గ్రామ భక్తులు పాల్గొన్నారు.

వెల్మల్‌లో దొంగల హల్‌చల్

- తాళం వేసిన ఇళ్ళకు కన్నం
- మూడు ఇళ్ళల్లో చోరీ
- సుమారు 20 తులాల బంగారం, రూ.11 లక్షల నగదు అపహరణ

నందిపేట, జూలై 17 : జిల్లాలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. తాళం వేసిన ఇళ్ళనే టార్గెట్ చేస్తున్నారు. ఒకేరోజు తాళం వేసిన మూడుఇళ్ళకు కన్నం వేశారు. పెద్దఎత్తున బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్ళారు. రెండిళ్ళలోనే సుమారు 20 తులాల బంగారం, 18 తులాల వెండి ఆభరణాలు, రూ.11 లక్షల నగదు అపహరించారు. గ్రామస్తులు, బాధితులు తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నందిపేట మండలం వెల్మల్ గ్రామానికి చెందిన డాక్టర్ చంద్రశేఖర్ తన భార్యతో కలిసి ఈ నెల 16న యాదాద్రికి యాత్రకు వెళ్ళారు. ఇళ్ళకు తాళం వేసి ఉండడంతో ఆ ఇంటినే గుర్తుతెలియని దొంగలు టార్గెట్ చేశారు. తాళం పగలగొట్టి ఇంట్లోని రూ.10 లక్షల నగదు, 9తులాల బంగారం ఎత్తుకెళ్ళారు. యాత్రకు వెళ్ళిన దంపతులు బుధవారం ఉదయం తిరిగి వచ్చి చూడగా ఇండ్లకు తాళం పగలకొట్టి, వస్తువులు చింద వందర ఉండడంతో బిత్తరపోయారు. అలాగే నగలు, నగదు లేకపోవడంతో లబోదిబోమన్నారు. ఇటీవలే బాధితుడు డాక్టర్ చంద్రశేఖర్‌కు పంట చిట్టీ రావడంతో రూ.10 లక్షల నగదు జమైంది. అలాగే అదేరోజు రాత్రి దొంగలు డీకంపల్లి రోడ్డులో ఉన్న బర్లపాటి ప్రవీణ్ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆ ఇంట్లో నుంచి సైతం 8 తులాల బంగారు నగలు, రూ.30 వేల నగదు ఎత్తుకెళ్ళారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం శ్రమిస్తున్న ప్రవీణ్ తన భార్యతో నిజామాబాద్‌లో ఉంటున్నట్లు తెలిసింది. అదే దొంగలు మరో ఇంటిని గుళ్ళ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. దొంగలు వేలిముద్రలు దొరకకుండా కారం పొడిని చల్లినట్లు ఆనవాళ్ళు ఉన్నాయి. చంద్రశేఖర్ ఇంట్లో సీసీ కెమెరాలకు చిక్కకుండా దొంగలు మాస్కులు ధరించారు. ఈ విషయమై పోలీసులకు వివరణ కోరగా చంద్రశేఖర్ ఇంట్లో రూ.1.80లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, రూ.7.50లక్షల నగదు, బర్లపాటి ప్రవీణ్ ఇంట్లో రూ.1.69 లక్షల విలువైన ఆభరణాలు, నగదు చోరీకి గురైందని పేర్కొన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ జి.రాహుల్ హెగ్డే తెలిపారు.



చిందర వందరైన వస్తువులు

బారికేడ్ల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మోస్రా, జూలై 17 : మండలంలోని గోవూర్ గ్రామ శివారులో నిజామాబాద్, బాన్సువాడ ప్రధాన రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు తెలిపినా పరిష్కారం లేకుండా పోయిందని గ్రామస్థులు, గ్రామ మాజీసర్పంచ్ నరేందర్ రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై ప్రచురితమైన జూలై 07 ఆదివారం ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా.? అనే వార్తకు అధికారులు స్పందించి బారికేడ్లను ఏర్పాటు చేశారు. బారికేడ్లకు రంగులు అద్ది గ్రామం పేరు పోలీస్ శాఖ పేరు రాయించి రేడియంతో కూడిన స్టిక్కర్లు పెట్టి ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డితో పాటు గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.



బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

'ఓ భారతీయుడా' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



అంకాపూర్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై 17 : ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో బుధవారం ఓ భారతీయుడా అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆవిష్కరించారు. భారత సురక్ష సమితి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రచురించిన ఎమర్జెన్సీ 1975-77 ఓ భారతీయుడా పుస్తకాన్ని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితి కాలంలో జైలుకు వెళ్ళిన పుప్పాల రాజేందర్, రవినాథ్‌లను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధి కార ప్రతినిధి కలిగోట గంగాధర్, రాజేందర్, శ్రీధర్, రఘునాథ్ పాల్గొన్నారు.

'చేపూర్ పాఠశాలకు నిధులు మంజూరు చేయిస్తా'

ఆర్మూర్‌రూరల్, జూలై 17 : మండలంలోని చేపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. పాఠశాల శిథిలావస్థకు చేరిందని గ్రామస్థులు వివరించగా నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అంతకు ముందు శ్మశాన వాటికకు సంబంధించిన రోడ్డును పరిశీలించారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూస్తామని, శ్మశాన వాటిక రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషిచేస్తానని అన్నారు. అనంతరం ఆర్మూర్‌లోని సిద్దులగుట్టలో ఆయన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీగ్రంథాలయ సంస్థ చైర్మన్ మార చంద్రమోహన్, ఆర్మూర్ మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సాపల్లి జీవన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్‌మున్న, అయ్యప్ప శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్ పాల్గొన్నారు.



చేపూర్‌లో రోడ్డు స్థలాన్ని పరిశీలిస్తున్న వినయ్‌రెడ్డి

త్యాగానికి ప్రతీక మొహర్రం



ఉప్లూర్‌లో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

కమ్మర్‌పల్లి, జూలై 17 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మోహర్రం పర్వదినాన్ని బుధవారం మండలంలోని పలుగ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. గత తొమ్మిది రోజుల క్రితం గ్రామాల్లోని ఆషీర్‌ఖానాలో రంగురంగుల దట్టీలతో అలంకరించిన పీరీలను ప్రతిష్ఠించి ప్రతిరోజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు, ఊరేగింపులో పీరీలకు నీల్లుపోస్తు మొక్కులు చెల్లించుకున్నారు.

బోధన్‌రూరల్ : త్యాగనిరతికి, సహనానికి ప్రతీక మొహర్రం అని మైనారిటీ మత పెద్దలు అన్నారు. బోధన్‌లో కుల, మతాలకు అతీతంగా ప్రజల మధ్య సఖ్యతకు, ఐక్యతకు వారధిగా మొహర్రం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : కోటగిరి ఉమ్మడి మండలంలోని పలు గ్రామాలలో ముస్లిం సోదరులు మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో పీర్లను ఊరేగించారు.

పెర్కిట్ : ఆర్మూర్ పట్టణంలోని పెద్దబజార్ సూర్యవంశీ ఆరే కటికె సంఘం ఆధ్వర్యంలో బుధవారం పీర్ల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీరీలను వీధులలో ఊరేగించి గద్దెల వద్ద పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని ఆయా గ్రామంలో ప్రజలు మోహర్రం పండగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అర్గుల్, జక్రాన్‌పల్లి, లక్ష్మాపూర్, మునిపల్లి, బ్రహ్మణ్‌పల్లి, తొర్లికొండ, కలిగోట్, చింతలూర్, పడకల్, కేశ్‌పల్లి, సికింద్రాపూర్ గ్రామాల్లో మోహర్రం పండగను ప్రజలు, మైనారిటీ సోదరులు ఘనంగా జరిపారు.



ఖిల్లా డిచ్‌పల్లిలో పీరిలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

రుద్రూరు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పీరీలను వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ గ్రామాల్లో నృత్యాలు చేశారు. అనంతరం పీరీలకు నైవేద్యం సమర్పించారు.

నవీపేట్ : మండలంలోని యంచ, స్టేషన్ ఏరియాలలో బుధవారం పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను ఊరేగించారు.

డిచ్‌పల్లి : ఖిల్లా డిచ్‌పల్లిలో చిన్నా పెద్దా తేడా లేకుండా గ్రామస్తులంతా వేడుకల్లో పాల్గొన్నారు. పీరీల పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు.

మోస్రా : మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది

ఆర్మూర్‌టౌన్ , జూలై 17 : మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ న్యాయది నోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది గరడి ఆనంద్ చట్టాలు, న్యాయ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, కోశాధికారి నారాయణగౌడ్, నర్సింహారెడ్డి, జితేందర్, సుదీర్‌బాబు, వెంకట్రాంరెడ్డి, ద్యాగ ఉదయ్, పెంట జలందర్ పాల్గొన్నారు.

నా ఫిర్యాదుపై చార్జిషీట్ ఇవ్వండి : కౌన్సిలర్



మాట్లాడుతున్న కౌన్సిలర్

ఆర్మూర్‌టౌన్ , జూలై 17 : చార్జిషీట్ దాఖలు చేయాలని పలుమార్లు పోలీసులను కోరినప్పటికీ స్పందించడం లేదని కౌన్సిలర్ బదం రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సంవత్సరం గడుస్తుందని, గత సంవత్సరం నవంబర్‌లో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేశామని ఇప్పటి వరకు చార్జిషీట్ వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని తన పిటిషన్‌పై వెంటనే చార్జిషీట్ దాఖలు చేయా లని ఆయన కోరారు.

పండుగ సాయన్న జయంతి వేడుకలు

నవీపేట, జూలై 17 : నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ముదిరాజ్ ముద్దుబిడ్డ పండుగ సాయన్న జయంతి వేడుకలు బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్థానిక పెద్దమ్మతల్లి ఆలయం వద్ద పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సుంకరి మహిపాల్, సందీప్, సాయి, గంగాధర్, సాయన్న, హన్మాండ్లు, విఠల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఎడపల్లి మండల సంఘం ఆధ్వర్యంలో బుధవారం పండగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లిరాజు, మండల ముదిరాజ్ నాయకులు సున్నపు ఒడ్డెన్న, జనార్ధన్, యాసాడ రాజ్ కుమార్, అంజనేయులు, శ్రీనివాస్, మనోజ్, కృష్ణ ఉన్నారు.

పదవీ విరమణ చేసిన ఎంపీపీకి వీడ్కోలు సన్మానం

నందిపేట, జూలై 17 : మండలంలోని వన్నెల్(కే) గ్రామంలో బుధవారం ఇటీవల పదవీ విరమణ చేసిన నందిపేట ఎంపీపీ వాకిడి సంతోష్ రెడ్డికి వీడ్కోలు పలికారు. పంచాయతీ మాజీ పాలకవర్గంతో పాటు కార్యదర్శి, సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, వివిధ కులసంఘాల సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, సొసైటీ మాజీచైర్మన్లు మాజీ ఎంపీపీ వాకిడి సంతోష్ రెడ్డిని సన్మానించారు. విడివిడిగా పుష్ప గుచ్చాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటిపల్లి లలిత, మాజీ ఉపసర్పంచ్ కాటిపల్లి కృష్ణారెడ్డి, ఖుద్వాన్‌పూర్ సొసైటీ మాజీ చైర్మన్ లోకహన్మాండ్లు, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం

జక్రాన్‌పల్లి, జూలై 17 : మండలంలోని అర్గుల్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థి గత ఏడాది క్రితం మృతిచెందగా వారి కుటుంబసభ్యులకు బుధవారం ఇతర విద్యార్థులు ఆర్థికసహాయం అందజేశారు. అర్గుల్‌కు చెందిన షాదుల్లా గత ఏడాది మృతిచెందగా ఆయన కుటుంబం దీనస్థితిలో ఉందని తెలుసుకొని పూర్వవిద్యార్థులు రూ.37 వేల 500 ఆర్థిక సహాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు చింత మహేష్, సంగం మహిపాల్, పెద్దిరాజు, ప్రవీన్‌కుమార్, బెల్దారి గంగాధర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి దుర్మరణం

ముప్కాల్, జూలై 17 : బాల్కొండ మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన భూమ్మిర్త పృథ్వీరాజ్ (19) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి దుర్మారణం చెందాడు. ఎస్సై యాసిర్‌అర్ఫత్ తెలిపిన వివరాల ప్రకారం... పృథ్వీరాజ్ బుధవారం మధ్యాహ్న సమయంలో ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో ట్రాక్టర్ కడిగేందుకు తీసుకువెళ్లాడన్నారు. అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో గ్రామశివారులోని నాగలింగేశ్వర ఆలయం వద్దకు రాగానే ట్రాక్టర్ బోల్తాపడిందని ఎస్.ఐ తెలిపారు. కాసేపటికి చిన్నన్న దేవిదాస్ సమాచారం ఇవ్వడంతో తండ్రి పురుషోత్తం వెళ్ళి చూడగా ట్రాక్టర్ కిందపడి తీవ్రగాయాలతో మృతిచెందాడన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

జూనియర్ లైన్‌మెన్‌పై దాడిని ఖండించిన ఉద్యోగులు

వేల్పూర్, జూలై 16 : మండలంలోని పోచంపల్లి గ్రామ జూనియర్ లైన్‌మన్ సందీప్ మాజీ ఉపసర్పంచ్ చింతలపల్లి గంగారెడ్డి చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. బుధవారం వేల్పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి కె.నరేందర్‌నాయక్ మాట్లాడుతూ పోచంపల్లి గ్రామంలో మంగళవారం డీలిఫ్ట్ ఆపరేట్ చేస్తున్న సమయంలో జూనియర్ లైన్‌మెన్ సందీప్‌పై మాజీఉపసర్పంచ్ దాడి చేయడం హేయమైన చర్య అని, గ్రామంలో ఓ సంఘ భవనానికి ఎలాంటి అనుమతులు లేకుండా డైరెక్టర్‌గా సర్వీస్ వైర్ పెట్టుకొని అక్రమంగా విద్యుత్ వాడుతుంటే ఆ సర్వీసుల్ని జూనియర్ లైన్‌మెంట్ చూపిస్తుండగా మాజీఉపసర్పంచ్ చింతలపల్లి గంగారెడ్డి అనే వ్యక్తి అకారణంగా కోపంతో దూషిస్తూ జూనియర్ లైన్‌మన్ సందీప్ కాలర్ పట్టుకొని నెట్టేస్తూ దాడి చేశారన్నారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మాజీ ఉపసర్పంచ్ చింతలపల్లి గంగారెడ్డిపై కేసు నమోదు చేసి వెంటనే రిమాండ్‌కు పంపాలని ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి నరేందర్‌నాయక్ ఎస్సైను కోరారు. కార్యక్రమంలో వేల్పూర్ సెక్షన్ లీడర్ కె.రాజు, లైన్ ఇన్‌స్పెక్టార్ నర్సయ్య, లైన్‌మెన్‌లు నరేష్, సాయిలు, జోసఫ్ ఉన్నారు.

గుంతలమయంగా బెటాలియన్ సర్వీస్‌రోడ్డు

డిచ్‌పల్లి, జూలై 17: 44వ జాతీయ రహదారి తెలంగాణ ప్రత్యేక పోలీస్ ఏడో బెటాలియన్ పక్కన గల సర్వీస్ రోడ్డు గత కొన్నేళ్ళుగా గుంతలమయంగా మారింది. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయడం లేదు. పోలీస్‌స్టేషన్ నుంచి ఘన్‌పూర్, ముల్లంగి, కులాస్‌పూర్, ఖిల్లా డిచ్‌పల్లి వెళ్లే వాహనదారులు ఈ గుంతల మయంగా ఉన్న రోడ్డు నుంచే కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు ద్వార వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు మరమ్మతు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. తరుచూ ఇస్లాంపూర రైల్వే గేటు పడుతుండడంతో చాలా మంది వాహనచోదకులు గ్రామాలకు వెళ్తంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును మరమ్మతులు చేయాలని స్థానికులు వేడుకుంటున్నారు.



గుంతల మయంగా మారిన బెటాలియన్ సర్వీస్ రోడ్డు



ఇందల్వాయి-ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న చంద్రయాన్‌పల్లి ముదిరాజ్ సంఘ సభ్యులు

ఎమ్మెల్యేను కలిసిన ముదిరాజ్ సంఘ సభ్యులు

ఇందల్వాయి, జూలై 17: మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘ సభ్యులు బుధవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. నూతన కమిటీ ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యేను కలిసి పెద్దమ్మ ఆలయం వద్ద నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి నిధులు ఇవ్వాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ పెద్దలు చిన్నబాలయ్య, గంగాధర్, మల్లయ్య, రాజన్న, శ్రీధర్, మల్లేష్, పెద్దబాలయ్య, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో జ్వరాలపై సర్వే



జ్వరాలపై సర్వే నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య బృందం

మోపాల్, జూలై 17: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఎంత మందికి జ్వరాలు వస్తున్నాయో తెలుసుకునేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం గ్రామాల్లో సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని ముదక్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడి టీచర్లు సమక్షంలో మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహించారు. ఇంటిముందు మురికినీరు నిలువ ఉంచకూడదని సూచించారు. అదేవిధంగా కుండీలలో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తమ ఇంటి ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రంగా లేకపోతే దోమలు వ్యాప్తి చెంది అనారోగ్య బారిన పడుతారని ముందుజాగ్రత్తగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గత రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల గ్రామీణ ప్రాంత రోడ్లన్నీ మురికి నీటితో నిండిపోతున్నాయని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సుశాంత్, వెంకటేశ్, ఆశీష్‌రాజ్, ప్రత్యూష, భూలక్ష్మి, గంగాధర్, రాజేంద్ర, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మేస్త్రీకి గాయాలు

మోపాల్, జూలై 17: మండల కేంద్రంలో బుధవారం ఇంటి పనులు చేస్తూ పై అంతస్తు నుంచి బాలయ్య ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. బోర్గాం(పి) గూడెంకు చెందిన మేస్త్రీ బాలయ్య ఇంటి పనులు చేయడం కోసం మోపాల్‌కు వెళ్లాడు. అక్కడ పనులు చేస్తూ పై అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడినట్లు స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ బాలయ్యను ప్రథమ చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

18న ఆశావర్కర్ల ధర్నా

పెద్దబజార్, జూలై 17: ఈనెల 18న ఆశావర్కర్ల సమస్యలపైన ఎమ్మెల్యేల ఇంటి ముందు ధర్నాను జయప్రదం చేయాలని ఆశావర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆశావర్కర్ల సమస్యలపై ధర్నా నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ శాసన సభ సమావేశాల సందర్భంగా ఆశావర్కర్ల సమస్యలపై శాసనసభలో చర్చించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం 18వేల రూపాయలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదభీమా, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. 2023 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజుల ఆశావర్కర్ల నిరవధిక సమ్మె చేశామని అన్నారు. సమస్యలను పరిష్కారం చేయకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశాయూనియన్ జిల్లా కోశాధికారి రేణుక, జిల్లా ఉపాధ్యక్షురాలు సుకన్య, రేవతి, అనిత, సుమలత, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అమలు చేయాలి

పెద్దబజార్, జూలై 17: ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటర్ ఫీడింగ్‌లో జరిగిన అవకతవకలను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులందరికి గృహజ్యోతి ఉచిత కరెంటు, గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ పథకాలను అమలు చేయాలని బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ న్యాలం రాజు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్‌కు కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ గత సంవత్సరం డిసెంబర్ నెలలో అధికారులు దగ్గరుండి దరఖాస్తులను స్వీకరించారని రసీదును కూడా ప్రజలకు అందజేయడం జరిగిందన్నారు. అధికారులు ఇచ్చిన రసీదు గృహజ్యోతి, సబ్సిడీ సిలిండర్లకు సంబంధించిన వివరాలు ఉన్నప్పటికీ కంప్యూటర్ ఫీడింగ్ తప్పుల వల్ల లబ్ధిదారులకు అన్యాయం జరిగిందన్నారు. వెంటనే కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లు స్పందించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

ఇందల్వాయి, జూలై 17: మొహర్రం పండుగను పురస్కరించుకొని మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో హిందూ, ముస్లింలు సోదరభావంతో వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలో ఎక్కడ లేనివిధంగా సిర్నాపల్లి గ్రామంలో మొహరం వేడుకలు నిర్వహిస్తామని ముస్లీం మత పెద్దలు తెలిపారు. మొహరం సందర్భంగా పీర్లను అందంగా ముస్తాబు చేసి వేడుకలను నిర్వహించారు. ఒకరి తర్వాత ఒకరు నృత్యాలు చేస్తూ పీర్లను ఊరేగించారు. హిందూ ముస్లింలు కలిసి అత్యంత వైభవంగా పండుగ నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ వేడుకలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున సిర్నాపల్లికి చేరుకున్నారు.

మోపాల్: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం మొహర్రం పండుగను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని ముదక్‌పల్లి గ్రామంలో ఈ పండుగను వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం పాడి పంటలతో పాటు పశువులు, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ మొహరం పండుగను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని విడిసి పెద్దలు తెలిపారు. ఈ మొహర్రం పండుగలో కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. పండుగ సందర్భంగా పీర్లను గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లాలో వరుస దొంగతనాలు

- ఊపిరి పీల్చుకోలేకపోతున్న పోలీసులు
- తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తున్న దొంగలు
- కొత్త ముఠా పనే అంటున్న స్థానికులు

ఖిల్లా, జూలై 17: జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో దుండగులు వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసుకుని దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాల్‌గా మారుతున్నారు. జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎక్కడ ఏ ఇంటిలో దొంగలు చొరబడతారోననే ఆందోళన చెందుతున్నారు. దొంగతనాలు పెరిగిపోవడానికి పోలీసుల వైఫల్యమే కారణమంటున్నారు. తాజాగా నందిపేట్ మండలం లోని వెల్మల్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి మూడిళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. సుమారు 20తులాల బంగారం, 18 తులాల వెండి, 11లక్షల నగదు అపహరించారు. నగరంలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులే పోలీసుల దృష్టి మళ్లించేందుకు మండలాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తాజా ఘటన ఉదాహరణగా నిలుస్తుంది. రెండు వారాలుగా జిల్లాలోని పలు పోలీసు స్టేషన్ల పరిధుల్లో దొంగతనాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా నగర శివారుకాలనీలతో పాటు నగరంలోని ప్రశాంతంగా ఉండే ప్రాంతాలను సైతం వారు వదలడం లేదు. తాళాలు వేసి ఉన్న ఇండ్లను పగలు గుర్తించి దొంగతనాలను చేయడానికి అనువుగా ఉన్న వాటినే ఎన్నుకుంటున్నారు. ప్రత్యేకంగా తాళం వేసి ఉన్న ఇండ్లనే దోచుకుంటున్న దుండగులు జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చినట్లుగా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలంగా సద్దుమణిగిన దొంగతనాలు ఇటీవల ఊపందుకుంటున్నాయి. నగరంలోని ఆరవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంటిలోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. ఆటోనగర్‌కు చెందిన రఫీక్ కుటుంబం ఇంటికి తాళం వేసి తన బావమరిదిని విదేశాలకు వెళ్లేందుకు ఫ్లైట్ ఎక్కించడానికి వెళ్లి వచ్చే లోపే దుండగులు ఇల్లుగుల్ల చేశారు. సుమారు 20తులాల బంగారు ఆభరణాలు, వెండి, నగదును అపహరించుకుని వెళ్లారు. అదే విధంగా నగరంలోని నాల్గోవ, మూడవ టౌన్ పోలీసు స్టేషన్ల పరిధిల్లో వరుసగా దొంగతనాలు జరిగాయి. గత ఆదివారం అర్ధరాత్రి ప్రాంతంలో నగరశివారులోని ముబారక్‌నగర్, గంగాస్థాన్ ఫేస్-1లో దొంగలు హల్‌చల్ చేశారు. రాత్రి వేళ తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇండ్లను గుర్తించి ఇళ్ల తాళాలను ధ్వంసం చేసి లోనికి చొరబడి ఉన్నదంతా ఎత్తుకెళ్లారు. ముబారక్‌నగర్‌లో నివాసం ఉండే ప్రభుత్వ ఉద్యోగి ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గుర్తించిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీర్వాను ధ్వంసం చేసి అందులోని సుమారు. 50వేలు నగదు, విలువైన వస్తువులను అపహించారు. అదే విధంగా క్యాతం కళావతి ఇంట్లో చొరబడి సుమారు.రూ.30వేల నగదు, విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. దుండగులు ఎవరికి అనుమానం రాకుండా ఉండేందుకు కారులో వచ్చి ఉదయం పూట కాలనీల్లో తిరిగి తాళాలు వేసి ఉన్న ఇండ్లను గుర్తించి అనంతరం రాత్రివేళ దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు జరుగుతున్నాయి.



దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

పెట్రోలింగ్‌ను ముమ్మరం చేస్తున్నాం..

:రాజవెంకటరెడ్డి, నిజామాబాద్ ఏసీపీ

రాత్రిపూట పెట్రోలింగ్‌ను ముమ్మరం చేస్తున్నాం. కొత్త వ్యక్తులపై నిఘా పెడ్తున్నాము. ఇంటికి తాళం వేసి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు సైతం పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలి. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో రాత్రివేళ పోలీసుల గస్తీ ఏర్పాటు చేస్తున్నాం. దొంగతనాలను సాధ్యమైనంత వరకు తగ్గించి ప్రజల ఆస్తులను కాపాడుతాం.

ఆగస్టు 15 లోగా రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, జూలై 17: ఆగస్టు 15లోగా రైతులందరికీ రూ.రెండు లక్షల రుణమాఫీ సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని పోచారం నియోజకవర్గంలో వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతులను రుణ విముక్తి చేయడంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు మొదటి విడతలో లక్ష రూపాయల వరకు ఉన్న రుణాలు ఉన్న రైతులకు రేపు రుణమాఫీ మొత్తం బ్యాంకులో జమ చేస్తారన్నారు. లక్ష రపాయల లోపు ఉన్న రాష్ట్రంలోని మొత్తం 11.50 లక్షల మంది రైతులకు గురువారం రూ.6,800 కోట్లు రైతుల ఖాతాలలోకి జమ అవుతాయన్నారు. ఇంత భారీ మొత్తంలో రైతులకు రుణమాఫీ జరగడం గొప్ప విషయమని ఆయన తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలో లక్ష రూపాయల వరకు ఉన్న 13,600 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రైతు రుణమాఫీని పురస్కరించుకుని ప్రతి ఏఈవో క్లస్టర్ పరిధిలోని లబ్ధి పొందిన రైతులతో రైతు వేదిక వద్ద సంబరాలు జరపాలని ఆయన సూచించారు. ఈ సంబురాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. అందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వం లో బాన్సువాడ నియోజకవర్గం అద్భుతంగా అభివృద్ధి చెందినదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా ఈ అభివృద్ధి కొనసాగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఏడీఏ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: నేడు ఉమ్మడి మండలాల వేదికలో లక్ష లోపు రుణాల మాఫీ కార్యక్రమం ఉంటుందని ఉమ్మడి మద్నూర్ మండల వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేరుగా రుణమాఫీ లాంఛనంగా ప్రారంభించి లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడుతారని అన్నారు. మద్నూర్, లింబర్ రైతువేదిక ద్వారా రైతులు ఈ కార్యక్రమాన్ని వీక్షించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, బ్యాంకు ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు ఈ సంబరాల్లో పాల్గొనాలన్నారు. కావున మద్నూర్ మండల రైతులు మద్నూర్ రైతు వేదికలో, డోంగ్లీ మండల రైతులు లింబూర్ రైతు వేదికలో తప్పనిసరిగా అధిక సంఖ్యలో కార్యక్ర మానికి హాజరు కావాలని ఆయన కోరారు.

పెద్ద కొడప్‌గల్: మండలంలోని రైతు వేదికలో నేడు రుణమాఫీపై సంబరాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి నదీమ్ ఉద్దీమ్ తెలిపారు. రైతులకు సంబంధించిన లక్ష రూపాయల లోపు రుణమాఫీకి సంబంధించిన నిధులు రైతుల ఖాతాలలో జమ కానున్నాయని తెలిపా రు.

దోమకొండ: ప్రభుత్వం రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తుందని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి మాట్లాడుతూ మేనిఫేస్టోలో పొందుపరిచిన విధంగా ఆగస్టు 15లోపు రూ.2లక్షలు రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు సీతారాం మధు, డీసీసీ జనరల్ సెక్రటరీ తాటిపల్లి శ్రీకాంత్, నల్లపు శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, అబ్రబోయిన రాజు, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ప్లీడర్‌గా శ్రావణ్ కుమార్ గౌడ్

దోమకొండ, జూలై 17: మండలంలోని గొట్టిముక్కుల గ్రామానికి చెందిన పి. శ్రావణ్‌కుమార్‌గౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ప్లీడర్‌గా నియమించింది. ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా 19 మందిని ప్రభుత్వ అడ్వకేట్లుగా నియమించినట్లు శ్రావణ్ కుమార్‌గౌడ్ తెలిపారు. వీరు హైకోర్టులో ప్రభుత్వ కేసులను వాదించనున్నారు. న్యాయశాఖ కార్యదర్శి ఆర్. తిరుపతి పేరిట జీవో 399ని జారీ చేసిందని తెలిపారు. శ్రావణ్‌గౌడ్ 10వ తరగతి వరకు కామారెడ్డిలో చదివి పై చదువులు హైదరాబాద్‌లో అభ్యసించాడు. లా పూర్తి చేసి హైదరాబాద్‌లోని హైకోర్టులో న్యాయవాదిగా పనిచేసిన సమయంలో హైకోర్టు బార్ అసోసియేషన్ ట్రెజరర్‌గా పనిచేశారు. శ్రావణ్ కుమార్ గౌడ్ చేసిన సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ప్రభుత్వ ప్లీడర్‌గా నియమించింది. శ్రావణ్ కుమార్‌గౌడ్‌ను హైకోర్టు ప్లీడర్‌గా నియమించడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తా

- ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ టౌన్, జూలై 17: సమాజ హితం కోరే బ్రాహ్మణుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని బ్రాహ్మణ సంఘ భవనంలో నిర్వహించిన సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆగ్రో చైర్మెన్ కాసులను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి డైనమిక్ ముఖ్యమంత్రి అని, ప్రజల కోసమే పని చేస్తున్నారన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ముందుగా రైతు రుణమాఫీ చేస్తోందన్నారు. బ్రాహ్మణుల్లో కూడా రైతులు ఉన్నారని, వారికి కూడా రుణమాఫీ జరుగుతుందన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

పెద్దబజార్, జూలై 17: రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు రుణమాఫీ కోసం ఇచ్చిన మార్గదర్శకంలో అనేక నిబంధనల మూలంగా అర్హులైన పేద మధ్యతరగతి రైతులు రుణమాఫీకి దూరమయ్యే పరిస్థితుల్లో ఉన్నాయని అన్నారు. వాటిని సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేస్తున్న నిబంధనలను సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల దగ్గర గానీ, రైతుమిత్ర గ్రూప్‌ల వద్ద ఇతర సమస్యలతో తీసుకున్న రుణాలను చెల్లించేది లేదన్నట్లుగా నిబంధనలు ఉందని దీని మూలంగా పేద మధ్యతరగతి రైతులు ప్రధానంగా దళిత అట్టడుగు వర్గాల రైతాంగం పోయే ప్రమాదం ఉందని దీన్ని సవరించాలని డిమాండ్ చేశారు.

బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న క్రాఫ్‌లోన్ మాఫీ చేయాలి

పెద్దబజార్, జూలై 17: బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న క్రాఫ్‌లోన్ మాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకులలో వ్యవసాయానికి అవసరాల కోసం తీసుకున్న క్రాఫ్‌లోన్ బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న లోన్ 2లక్షల రూపాయల రుణాలను మాఫీ చేయాలన్నారు. గత ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికి 2లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు విఠల్‌గౌడ్, రఘురాం, రంజిత్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు చేసుకున్న డబ్బులను వెంటనే చెల్లించాలి

సిరికొండ, జూలై 17: సహారా ఇండియా కంపెనీలో పొదుపు చేసుకున్న దేశంలో 12 కోట్ల పేద, మధ్య తరగతి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం 86వేల కోట్ల డబ్బులను చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ దాసు కోరారు. సిరికొండలో జరిగిన కార్యకర్తల సమావేశంలో దాసు మాట్లాడుతూ.. భారతదేశంలోని 12 కోట్ల మంది పేదలు, మధ్య తరగతి ప్రజలు వివిధ అవసరాలకు ఉపయోగపడుతాయని పైసా, పైసా కూడబెట్టి సహరా ఇండియా కంపెనీలో సుమారు 86వేల కోట్ల డబ్బులను పొదుపు చేసుకున్నారన్నారు. భవిష్యత్తులో తమ పిల్లలకు ఉపాయోగపడుతాయనే ఆశతో ప్రజలు పొదుపు చేసుకుంటే కంపెనీతో కుమ్మక్కై ప్రజలకు డబ్బులు రాకుండ బీజేపీ నేతలు అడ్డుపడుతున్నారని ఆయన ఆరోపించారు.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న సీఐ నరహరి

నగరంలో యువకుడి దారుణ హత్య

ఖిల్లా, జూలై 17: నగరంలోని నాల్గోటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో గల రూరల్ ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయం సమీపంలో ఉన్న హోటల్ వద్ద గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో యువకుడు హత్యకు గురైన ఘటన బుధవారం వెలుగు చూసింది. సమాచారం అందుకున్న నగర ఇన్స్‌పెక్టర్ నరహరి, ఎస్ఐ పాండేరావ్‌తో కలిసి ఘటన స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలను పరిశీలించారు. మృతుడు బిహార్ రాష్ట్రానికి చెందిన బిహారీపాండే(22)ను గుర్తు తెలియని వ్యక్తులు తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నగరంలోని పులాంగ్‌బ్రిడ్జి సమీపంలో గల అంగిటి హోటల్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న భవంతిలో ఎలక్ట్రిషన్‌గా పని చేస్తున్నాడని, మంగళవారం రాత్రి తనకు తలనొప్పిగా ఉందని మెడికల్‌షాపుకు వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి ఉదయం వరకు రాలేదని తోటి కార్మికులు తెలిపినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు మద్యం తాగి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలను పరిశీలిస్తున్నట్లు నగర ఇన్స్‌పెక్టర్ నరహరి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. హత్య జరిగిన ప్రదేశంలోని సీసీ టీవి ఫుటేజీలను పరిశీస్తున్నారు. డ్వాగ్‌స్క్వాడ్ ద్వారా నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. పోలీసు జాగిలాలు హత్య జరిగిన ప్రదేశం నుంచి సమీపంలో గల మద్యం దుకాణాం పర్మిట్ రూం వద్దకు వెళ్లి అక్కడే ఉండిపోయినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఆసుపత్రి నుంచి రోగి పరార్

ఖిల్లా, జూలై 17: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వ్యక్తి అదృశ్యమైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. ఎలుపుగొండ గ్రామం పాల్వంచ మండలం కామారెడ్డి జిల్లాకు చెందిన మంగళి సంగయ్య అనే వ్యక్తి నాలుగు రోజుల క్రితం చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. ఈనెల 16న ఉదయం బాత్‌రూమ్‌కు వెళ్లివస్తానని భార్యకు చెప్పి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇతనికి సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని కల్లు తాగే అలవాటు ఉందని, వెళ్లే సమయంలో బ్లూకలర్ షర్ట్, లుంగీపై ఉన్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో డి.వి జయ్‌బాబు తెలిపారు.

హత్య కేసును ఛేదించిన రైల్వే పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే సీఐ

ఖిల్లా, జూలై 17: నవీపేట మండలం ఫకీరాబాద్ రైల్వే స్టేషన్ వద్ద రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్న దంపతుల కేసును రైల్వే పోలీసులు ఛేదించారు. ఆత్మహత్యకు సంబంధించిన వివరాలను రైల్వే పోలీస్ స్టేషన్‌లో రైల్వే ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ వెల్లడించారు. పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామానికి చెందిన యువ దంపతులు అనీల్‌కుమార్, శైలజలు సోమవారం సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందేనన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని సెల్ఫీ వీడియో ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. దంపతుల పిన్ని లక్ష్మి దుశ్చర్యం వల్లే యువ దంపతులు ఆత్మహత్య చేసుకున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. లక్ష్మిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్ కోసం హైదరాబాద్ రైల్వే కోర్టుకు పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రైల్వే ఎస్సై సాయిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలి

పెద్దబజార్, జూలై 17: తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన అర్హులైన కళాకారులకు సారధిలో ఉద్యోగాలు ఇవ్వాలని జిల్లా నిరుద్యోగ కళాకారుల అధ్యక్షుడు చిట్టిబాబు అన్నారు. బుధవారం నగరంలోని గౌతంనగర్‌లోగల ఎన్‌జీవోస్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కోసం గోసి, గొంగడి వేసుకొని కాలికి గజ్జలు కట్టుకొని ఊరూరా తిరిగి ఉద్యమ స్ఫూర్తిని రగిలించామని అన్నారు. ఉద్యమం కోసం చేస్తున్న ఉద్యోగాలను సైతం వదిలేసి భార్యపిల్లలకు దూరంగా ఉంటూ ఎన్నో కష్టాలు పడి ధూంధాం కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, అంజనేయులు, గోపాల్, కర్క రమేష్, మహేందర్, సంజయ్, దేవరాజ్, స్వామి, కిష్టయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.120	రూ.230	రూ. 250
వెన్‌కాబ్(కిలో)	: రూ.125	రూ.235	రూ. 255



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.75,000	రూ.70,000	రూ.960

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి (3డి తెలుగు) (11.00, 6.30)
: కల్కి (హిందీ) (2.45, 10.15)
స్క్రీన్-2 : భారతీయుడు-2 (11.15, 3.00, 6.45, 10.30)
స్క్రీన్-3 : కిల్ (హిందీ) (12.15, 2.45, 9.00)
: భారతీయుడు-2 (5.15)
స్క్రీన్-4 : సర్ఫిరా (హిందీ) (12.20, 3.40, 7.00, 10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి (తెలుగు) (10.30, 1.15, 4.45, 7.15, 10.30)
స్క్రీన్-2 : భారతీయుడు-2 (10.20, 4.30, 8.00, 10.40)
: కల్కి (తెలుగు) (10.30)
స్క్రీన్-3 : భారతీయుడు-2 (10.20, 1.50, 10.40)
: కల్కి (తెలుగు) (7.15)

దేవి : భారతీయుడు-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : భారతీయుడు-2 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్